ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
నారాయణపేట
జిల్లా వార్తలు
సోమవారం 13 జనవరి 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 19.0



హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ జోరు

ప్రీ క్వార్టర్స్‌కు చేరిన తెలంగాణ బాలుర జట్టు 5



రైల్వే లైన్ డబుల్

- మహబూబ్‌నగర్- డోన్ డబ్లింగ్‌కు పీఎం మోదీ శ్రీకారం
- ఇప్పటికే హైదరాబాద్- మహబూబ్‌నగర్ రైల్వే లైన్ డబ్లింగ్ పూర్తి
- 197 కిలో మీటర్ల పనులకు రూ.2,208 కోట్ల వ్యయం
- ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోనే 143 కిలో మీటర్లు
- పెరుగనున్న రైళ్ల రాకపోకలు.. ● జిల్లా పరిధిలో పారిశ్రామిక ప్రగతికి ఊతం
- కృష్ణా- వికారాబాద్, గద్వాల- డోర్నకల్ కొత్త లైన్లపైనా ప్రజల్లో ఆశలు



మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్



మహబూబ్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైల్వే ప్రయాణం మరింత సులభతరం కానుంది. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రైల్వే మార్గాన్ని డబ్లింగ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో దశాబ్దాల కల నెరవేరనుంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉండే ఈ మార్గం రెండు రాష్ట్రాలను కలుపుతోంది. ముఖ్యంగా తెలంగాణ నుంచి రాయలసీమ జిల్లాలకు వెళ్లడానికి ఈ రైలు మార్గం ఉపకరిస్తోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మహబూబ్‌నగర్ నుంచి డోన్ మధ్య ఉన్న సింగిల్ లైన్ మార్గాన్ని డబ్లింగ్ చేసే పనులకు శంకుస్థాపన చేశారు. 2016-2017 మధ్య కాలంలో ఈ రైల్వేలైన్‌లో సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు మొత్తం 85 కిలో మీటర్ల రైలు మార్గానికి రూ.774 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం.. 2022 నాటికే డబ్లింగ్ పనులను పూర్తి చేసింది. దీంతోపాటు మహబూబ్‌నగర్ వరకు డబుల్ లైన్ విద్యుదీకరణ పనులు, కర్నూలు వరకు సింగిల్ లైన్ విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు ఈ రైలు మార్గంలో విద్యుత్ రైళ్లు పరుగులు పెడుతుండగా.. మహబూబ్‌నగర్ నుంచి డోన్ మధ్యలో ఉన్న రైలు మార్గం ఇప్పటికీ సింగిల్ లైన్‌గానే ఉంది. దీంతో రైళ్ల పాసింగ్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లు వచ్చినప్పుడు, ఆ మార్గంలో ఇతర రైళ్లు ఉన్నప్పుడు ఎక్కువ సయమం పాసింగ్ కోసమే పడుతోంది. అయితే ఈ దూరం మొత్తం 197 కిలో మీటర్లు కాగా.. 143 కిలోమీటర్లు మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఉంది. సింగిల్ లైన్ ఉండటం వల్ల ఎక్కువ రైళ్లను నడపలేని పరిస్థితి ఉంది. మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పూర్తయిన తర్వాత ఇక్కడి నుంచి విశాఖ వరకు రైలు కూడా ప్రారంభమైంది. మొత్తం దారి పూర్తయితే బెంగుళూరు, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, గోవాకు ఎక్కువ రైళ్లు నడవనున్నాయి.

రూ. 2,208 కోట్లతో శ్రీకారం..

ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి డోన్ మధ్యలో ఉన్న రైలు మార్గం పొడవు 295 కిలోమీటర్లు ఉంది. ఈ మార్గాన్ని బ్రిటీష్ హయాంలో 1922లో మీటర్ గేజ్ లైన్‌గా ప్రారంభించారు. 1929 పనులు పూర్తవగా.. స్వాతంత్ర్యానంతరం 1993-98 మధ్యలో దీన్ని బ్రాడ్ గేజ్ మార్గంగా మార్చారు. సికింద్రాబాద్- డోన్ మధ్యలో ఉన్న మార్గం నిడివిలో సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు రైలుమార్గం ఇప్పటికే డంబ్లింగ్ పూర్తి

(మిగతా 6లో..)

కొత్త లైన్లపైనా ఆశలు..

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఏకైక రైలు మార్గం ఉంది. గద్వాల నుంచి రాయిచూర్, కృష్ణా నుంచి జక్లేర్ వరకు రైలు మార్గం ఉంది. ఇంకా కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రధానంగా ఎన్నికల సమయంలో కృష్ణా- వికారాబాద్ రైల్వేలైన్‌పై అన్ని పార్టీలు హామీలు ఇచ్చాయి. ఇక్కడ ఫైనల్ లొకేషన్ సర్వే కూడా పూర్తయ్యింది. ఈ మార్గం పూర్తికి రూ2,196 కోట్ల ఖర్చవుతుందని అంచనా వేశారు. దీనివల్ల కొడంగల్, నారాయణపేట, మక్తల్, వికారాబాద్, తాండూర్ ఏరియాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రధానంగా సిమెంటు, ఇతర ఖనిజాలను ఎగుమతులు చేసుకునే అవకాశం ఏర్పడనుంది. ఈ ఏడాది ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఈ లైన్‌కు నిధులు కేటాయిస్తారనే ప్రచారం ఉంది. అలాగే రాయిచూర్-మాచర్ల రైల్వేలైన్ ప్రాజెక్టులో రెండున్నర దశాబ్దాల క్రితమే గద్వాల- రాయిచూర్ మార్గానికి బీజం పడి.. ఆ పనులు పూర్తయ్యాయి. అక్కడి నుంచి మాచర్ల వయా ఆరేపల్లి, వనపర్తి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి మార్గం మాత్రం ప్రారంభం కాలేదు. రెండేళ్ల క్రితం ఆ లైన్ అలైన్‌మెంట్ మార్చి.. గద్వాల- డోర్నకల్‌గా చేశారు. ఫైనల్ లొకేషన్ సర్వే కూడా చేసి, రూ.5,330 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. మొత్తం 296 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మించే అవకాశం ఉంది. అయితే దీనికి గత బడ్జెట్‌లో ఆమోదం పొందలేదు. దక్షిణ తెలంగాణ ఇప్పటికే పారిశ్రామికంగా వెనుకబాటులో ఉండగా.. ఈ మార్గం రూపుదిద్దుకుంటే.. ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు, ఆంధ్రప్రదేశ్‌కు కూడా కనెక్టివిటీ పెరుగుతుంది. వచ్చే బడ్జెట్‌లో ఈ రెండు లైన్లపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్‌దే

- పాలమూరు-రంగారెడ్డినీ మేమే పూర్తి చేస్తాం
- రాబోయే ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాను మరో కోనసీమగా మారుస్తాం
- ఏటా రూ.20 వేల కోట్లతో అభివృద్ధి పనులు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- మార్కండేయ లిఫ్ట్ మోటార్ల ప్రారంభం
- ఐదు విద్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభానికి భూమిపూజ



శాయినిపల్లి వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు తదితరులు

బిజినేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేసిన ఘనకీర్తి కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీశైలం, జూరాల, నెట్టంపాడు, కేఎల్ఐ ప్రాజెక్టులతో పాటు పాలమూర్ రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కూడా పూర్తి చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఉప ముఖ్యమంత్రి ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తిమ్మాజిపేట, బిజినేపల్లి, తాడూరు, నాగర్‌కర్నూల్ మండలాల పరిధిలోని పోతిరెడ్డిపల్లి, పాలెం, ఇంద్రకల్, గన్యాగుల, శ్రీపురం గ్రామాల్లో ఆదివారం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలకు భూమి

(మిగతా 4లో..)

నడిగడ్డలో విషాదం

- నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా మృతి
- నందమూరి తారకరామారావు పిలుపుతో రాజకీయాల్లోకి..

4



సంక్రాంతి సందడి

- పండుగకు గ్రామాలకు చేరుకున్న ప్రజలు
- రద్దీగా మారిన మార్కెట్లు
- నేడు భోగి..
- నువ్వుల రొట్టెలు ప్రత్యేకం



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



నారాయణపేటలో గంగిరెద్దును ఊరేగిస్తున్న వ్యక్తి

మహబూబ్‌నగర్ న్యూ టౌన్/నారాయణపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల ప్రజలు సిద్ధమయ్యారు. సోమవారం భోగి, మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను జరుపుకోనున్నారు. పండుగ నేపథ్యంలో పట్టణాలు, నగరాల్లో ఉంటున్న వారు ఇప్పటికే గ్రామాలకు చేరుకున్నారు. దాంతో పల్లెలు సందడిగా మారాయి.

కూరగాయలు కిలో రూ.80

భోగి రోజు మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేసి, రంగులు అద్దుతారు. ముత్తయిదువలు వాహినం ఇచ్చి పుచ్చు కుంటారు. చిన్న పిల్లల తలలపై భోగి పండ్లు వేసి, దిష్టి తీస్తారు. భోగి మంటలు వేసి, పాత వస్తువులను అందులో వేసి కాలుస్తారు. సజ్జలు, జొన్నలతో కలిపి నువ్వుల రొట్టెలు, అన్ని కూరగాయలు కలిపి కూర చేసుకొని తింటారు. నారాయణపేటలో అన్ని కూరగాయలు కలిపి కిలోకు రూ.80 వరకు విక్రయించారు.



పాలమూరులో గాలి పటాలను కొంటున్న పట్టణవాసులు



నారాయణపేటలో కూరగాయలు కొంటున్న పట్టణవాసులు

జోరుగా గాలిపటాల విక్రయాలు

సంక్రాంతి రోజు ఇళ్ల ముందు ముగ్గులు వేస్తారు. ఆలయాల్లో పూజలు చేస్తారు. స్వీట్లు, తినుబండారాలు చేసుకొని తింటారు. పండుగ రోజు గాలి పటాలు ఎగుర వేసేందుకు చిన్నారులు ఇప్పటికే వాటిని కొనుగోలు చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలో రోడ్ల పక్కన ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి గాలి పటాలను విక్రయించారు. రూ.50 నుంచి రూ.500 వరకు రేట్లు ఉన్నాయి.

కనుమ

కనుమ పండుగ వివిధ ప్రాంతాల్లో వివిధ పద్ధతుల్లో జరుపుకుంటారు. మాంసాహారాలు చేసుకుని తింటారు. నారాయణపేట జిల్లాలో పశువులు ఉన్నవారు వాటికి స్నానం చేయించి, పూజలు చేస్తారు. బక్షాలను సమర్పిస్తారు.

నువ్వుల రొట్టెలకు ధరల పోటు

గత ఏడాదికంటే పెరిగిన రేట్లు
నువ్వులకు కిలోపై రూ.50..
తెల్లజొన్నలు, సజ్జలకు రూ.5 చొప్పున పెరుగుదల 4

కళ తప్పిన పండుగ

కనిపించని గంగిరెద్దులు, హరిదాసులు 4

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- రేపటి నుంచి ప్రారంభం కానున్న సింగోటం లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు
- ఈనెల 17న సింగోటం జాతర షిడె
- 15 నుంచి ఉమామహేశ్వర జాతర
- రాష్ట్రం నలుమూలల నుంచి రానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు



సింగోటం రత్నగిరి కొండపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామి

5



ఉమామహేశ్వర ఆలయం



సింగోటం గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం

అక్కమహాదేవి గుహల సందర్శనకు సఫారీ సిద్ధం 4

● నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న ఉజ్జయిని పీఠాధిపతి

స్వాగతం పలికిన వాల్మీకులు 5

లైన్‌మన్ చాకచక్యం

● తప్పిన విద్యుత్ ప్రమాదం 5



ఎర్రవల్లి సమీపంలో జరిగిన ప్రమాదంలో దగ్ధమౌతున్న బస్సు(ఫైల్)

ఎగసిపడ్డ మంటలకు ఏడాది

గత ఏడాది జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లి దగ్గర అగ్నికి ఆహుతైన బస్సు
షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
ఒక మహిళ సజీవ దహనం 5
బస్సు అద్దాలను పగులగొట్టి మిగతా వారిని కాపాడిన పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ వర్కర్లు

పథకాల అమలుకు సంసిద్ధం కావాలి

● కలెక్టర్ విజయేందిర బోయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్ నగర్ కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు అధికారులు సంసిద్ధం కావాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, గ్రామ సభల ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. ఆదివారం ఆమె కలెక్టరేట్‌లో సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 10న హైదరాబాద్‌లో పథకాల అమలుపై కలెక్టర్లకు నిర్దేశించిన ఆదేశాలను వివరించారు. ఈ నెల 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రారంభించనుందని చెప్పారు. అందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నాలుగు పథకాల అమలు కోసం గ్రామ, వార్డు సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలన్నారు. నిబంధనలను అనుసరించి ఎంపిక చేసిన అర్హుల ముసాయిదా జాబితా ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలలో చదివి, వినిపించాలన్నారు. అభ్యంతరాలు ఉంటే గ్రామ సభల్లో స్వీకరించి 10 రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. 21 నుంచి 25 వరకు డేటా ఎంట్రీని కూడా పూర్తి చేయాలని సూచించారు. గ్రామ సభలలో ఇందరమ్మ కమిటీలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. పథకాలపై ఈ నెల 16న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి, ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, ఆర్డీవో నవీన్, జడ్పీసీఈవో వెంకట్ రెడ్డి, డీఆర్‌డీవో నర్సింహులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్‌దే



శాయిన్‌పల్లి వద్ద స్విచ్ ఆన్ చేసి, మోటార్లను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చిత్రంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పూజ చేశారు. బిజినేపల్లి మండలంలోని శాయిన్‌పల్లి గ్రామ సమీపంలో మార్కండేయ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పంప్‌హౌస్ మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాయినిపల్లి వద్ద ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడారు. దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలుగా కొనియాడారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సాగునీటి ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లా వాసిగా ఈప్రాంత అభివృద్ధి కోసం అవసరమైన నిధులు విడుదల చేయాలని ఆర్థిక మంత్రిగా నన్ను కోరాడని అన్నారు. రాబోయే ఐదేళ్లలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున కేటాయించి, రూ.లక్ష కోట్ల నిధులతో ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టి మరో కోనసీమగా మార్చాలనేదే సీఎం అభిలాషని అని అన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో ఒక ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు గత ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, జీవో 123, భూసేకరణ చట్టం 2013 ద్వారా సరైన న్యాయం చేయలేదని పలువురు నిర్వాసితులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారన్నారు. శాస్త్రీయంగా అధ్యయనం చేసి, వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రంలో ఎక్కడ కూడా విద్యుత్ సమస్య లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటలు సరఫరా చేస్తామన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, పెంచిన పింఛన్లు, మహిళలకు రూ.2500 అందించి మాట నిలబెట్టుకుంటామన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని ఎద్దేవా చేశారు. అప్పులున్నా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను జెడ్పీ ఛైర్మన్‌లుగా, ఎంపీపీలుగా, ఎంపీటీసీ సభ్యులుగా, సర్పంచ్‌లుగా గెలిపించాలని కోరారు. శాయిన్‌పల్లి తండాకు చెందిన మేగావత్ పూజ మెడికల్ సీటు సాధించినా పేదరికంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలియడంతో ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి రూ.40 వేల ఆర్థిక సాయాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్, కేఎల్‌ఐ ఈఎన్‌సీ విజయ భాస్కర్ రెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ రెడ్డి, ఈఈ పార్థసారథి, డీఈ వరప్రసాదు, ఏఈఈ శివరామ్, మండల కాంగ్రెస్ నాయకులు మిద్దె రాములు, అవంతి శంకర్, వెంకటస్వామి, అమృత్ రెడ్డి, గోవిందు రామకృష్ణ, వాల్యానాయక్, రాంచందర్ నాయక్, హరీష్ రెడ్డి, మాన్యానాయక్, వీరేందర్, కత్తె ఈశ్వర్, మిద్దె మల్లేష్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేసే వరకు నిద్రపోం: ఎంపీ మల్లు రవి

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే వరకు నిద్రపోమని నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు మల్లు రవి రైతులకు హామీ ఇచ్చారు. శాయినపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న కారణాలతో ప్రాజెక్టుల పనులు ఇప్పటి వరకు ఆలస్యమైన మాట వాస్తవమే అన్నారు. ఈప్రాంత అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటి నుంచి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో గెలిపించాల్సిన బాధ్యత ప్రజలదేనని అన్నారు.

అప్పులపాలు చేసిన కేసీఆర్: మంత్రి జూపల్లి

ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదేళ్ల పాటు అధికారంలో ఉండి రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పులపాలు చేశాడని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా రూ.రెండు లక్షల రైతు రుణమాఫీకి రూ.21 వేల కోట్లు కాంగ్రెస్ ఇచ్చిందన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు, భూమి లేని ప్రతీ నిరుపేదకు రూ.12 వేలు, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

రైల్వే లైన్ డబుల్

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుంది. ఇక మిగిలింది మహబూబ్‌నగర్ నుంచి డోన్ మార్గం. దీన్ని డబుల్ లైన్ చేసేందుకు పీఎం మోదీ విశాఖ సభలో శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.2,208 కోట్లు ఇందుకోసం కేటాయించారు. ఈ డబ్లింగ్, విద్యుదీకరణ పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం డబ్లింగ్ లేకపోవడం వల్ల మహబూబ్‌నగర్ వరకు రైళ్లను పాసింగ్‌లో పెడుతున్నారు. ఈ కారణంగా కర్నూలు నుంచి హైదరాబాద్ చేరుకోవాలంటే 5:30 గంటల సమయం పడుతోంది. డబ్లింగ్ పూర్తయితే అప్ ఒక లైన్‌లో డౌన్ మరో లైన్‌లో సులభంగా పాస్ అయ్యే అవకాశం ఏర్పడి, దాదాపు 3:30 గంటల్లోనే గమ్యం చేరుకునే అవకాశం ఉంటుంది. రెండు గంటల సమయం ఆదా కానుంది. ప్రస్తుతం హైదరాబాద్- బెంగళూరు మధ్య నడుస్తున్న వందే భారత్ రైళ్లు కూడా మరింత వేగంగా వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. అలాగే ఈ మార్గంలో రైళ్లరాకపోకలు పెరిగి పారిశ్రామిక ప్రగతికి ఊతం రానుంది. ఇప్పటికే ఫ్యూచర్ సిటీకి ప్రభుత్వం రూపకల్పన చేస్తోంది. పోలేపల్లి సెజ్‌లో అనేక ఫార్మా పరిశ్రమలు ఉత్పత్తులు చేస్తున్నాయి. కొత్తగా ఒక డ్రై పోర్టు మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ఇటు జాతీయ రహదారి, అటు డబుల్ రైల్వే లైన్‌తో పారిశ్రామికాభివృద్ధి జరుగనుంది.



తెల్ల జొన్నలు



పచ్చ జొన్నలు

నువ్వుల రొట్టెలకు ధరల పోటు

● గత ఏడాదికంటే పెరిగిన రేట్లు ● నువ్వులపై కిలోకు రూ.50..

● తెల్లజొన్నలు, సజ్జలకు రూ.5 చొప్పున పెరుగుదల



నారాయణపేట పాతగంజ్‌లోని చిరు ధాన్యాల దుకాణం వద్ద కొనుగోలుదారులు

నారాయణపేట,జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు జొన్నలు, సజ్జలతో నువ్వుల రొట్టెలు చేసుకోవడం తప్పనిసరి. పండుగ నేపథ్యంలో వాటి కొనుగోళ్లు జోరందుకోగా.. ధరలు పెరగడంతో సామాన్యులు, పేదలపై ప్రభావం పడనుంది. ఎన్నడూ లేని విధంగా తెల్ల నువ్వుల ధర కిలోకు గత ఏడాది రూ.150 ఉండగా, ఈ సారి రూ.200లకు చేరింది. గత ఏడాదికంటే రూ.50 పెరిగింది. తెల్ల జొన్నలు రూ.40 ఉండగా, రూ.45కు, సజ్జలు రూ.30 ఉండగా 35కు పెరిగింది. నాణ్యత బాగున్నవి తెల్ల జొన్నలు కిలో రూ.55, సజ్జలు రూ.45 చొప్పున విక్రయిస్తున్నారు. ఎర్ర, పచ్చ జొన్నల ధర గత ఏడాది రూ.45 ఉండగా రూ.55కు చేరింది. అంటే కిలో వెంట రూ.10 పెరిగింది.

కళ తప్పిన పండుగ

కనిపించని గంగిరెద్దులు, హరిదాసులు

నవాబ్‌పేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సంక్రాంతి పండుగ అంటే పల్లెలన్నీ కళకళలాడేవి. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలతో సందడిగా కనిపించేవి. ఇప్పుడు గంగిరెద్దుల ఆటలు తక్కువగా కనిపిస్తున్నాయి. హరిదాసులు అసలుకే కనిపించడం లేదు. ఆదరణ లేకపోవడంతో వారి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నవాబ్‌పేట మండల కేంద్రంలో 15 ఏళ్లుగా కొన్ని కుటుంబాలు గంగిరెద్దులను ఆడిస్తూ జీవనం సాగిస్తున్నాయి. షాద్‌నగర్, పరిగి, కుల్కచెర్ల, మహబూబ్‌నగర్, జడ్చర్ల తదితర ప్రాంతాలకు వెళ్లి గంగిరెద్దులను ఆడించడం ద్వారా ధాన్యం, డబ్బులు పోగు చేసుకుని జీవనం సాగించేవారు. కాలక్రమేనా వీరి ఆటలకు జనం నుంచి స్పందన లేకపోవడంతో పూట గడవడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

క్రీడలపై పెరిగిన మక్కువ

యువత, పిల్లలకు ఆటలపై మక్కువ పెరిగింది. ఖాళీ సమయాల్లో క్రికెట్, వాలీబాల్ తదితర ఆటలు ఆడుస్తున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పలు గ్రామాల్లో వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తున్నారు. మండలంలోని యన్మనగండ్ల, కేశవరావ్‌పల్లి, కొల్లూర్, పోమాల్, కూచూర్, కొండాపూర్ తదితర గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం వద్ద అయిజ ఎస్‌ఐ

అయిజటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం వెంకటాపురంలో ఆదివారం అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్విం టాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. స్టేజీ సమీపంలోని షెడ్డులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారనే సమాచారంతో పోలీసులు తనఖీ చేశారు. అందులో 31 బస్తాల్లో పన్నెండు క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ భాస్కర్ తెలిపారు.

నేడు ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించనున్న జెన్‌కో సీఎండీ

దోమలపెంట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా నేడు సోమవారం సందర్శించనున్నారు. గత రెండు వారాలుగా 1వ యూనిట్ డ్రాఫ్ట్‌ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్ నుండి వాటర్ లీకేజీ కారణంగా విద్యుత్ ఉత్పాదనతో పాటు, పంపుమోడ్ (నీటి మళ్లింపు) పూర్తిగా నిలిపి వేశారు. సీఎండీ జెన్‌కో డైరెక్టర్లతో కలిసి 1వ యూనిట్‌ను పరిశీలించి, వాటర్ లీకేజీకి గల కారణాలపై చర్చించనున్నట్లు సమాచారం. సీఎండీ పర్యటనను బయటకు పొక్కకుండా జెన్‌కో అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.



1వ యూనిట్ డ్రాఫ్ట్ ట్యూబ్ వద్ద జీరో ఫ్లోర్‌లో లీక్ అవుతున్న నీరు

నడిగడ్డలో విషాదం

మాజీ ఎంపీ మందా జగన్నాథ్ అస్తమయం

గద్వాల, ఎర్రవల్లి జనవరి 12(ఆంధ్రజ్యోతి) నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ నాయకుడు మందా జగన్నాథ్ చికిత్స పొందుతూ ఆదివారం హైదరాబాద్‌లో మృతి చెందారు. దీంతో నడిగడ్డలోని ఆయన స్వగ్రామం కొండేరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. డాక్టర్‌గా వృత్తిని చేపట్టిని ఆయన అనూహ్యంగా రాజకీయాలలోకి వచ్చి నాలుగుసార్లు నాగర్‌కర్నూల్ ఎంపీగా , నడిగడ్డ వాసిగా రెండు నియోజకవర్గాల అభివృద్ధికి పెద్దపీట వేశారు.

కుటుంబ నేపథ్యం..

మందా జగన్నాథ్ స్వస్థలం జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండ లం కొండేరు గ్రామం. 1951 మే 22న మందా పుల్లయ్య, మందా సవరమ్మలకు జన్మించారు. తండ్రి నాగార్జున సాగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుండటంతో ప్రాథమిక విద్యాభ్యాసం అక్కడే సాగింది. సెలవు రోజులలో పనిచేసి చదువు కోసం డబ్బులు సంపాదించి స్వయం కృషితో ఎదిగారు. మందాజగన్నాథ్‌కు భార్య సావిత్రమ్మ ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమార్తె మంద పల్లవి గైనకాలజిస్టుగా పనిచేస్తున్నారు. పెద్ద కుమారుడు శ్రీనాథ్ మెకానికల్ ఇంజనీరింగ్ చేసి షోషల్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు మంద విశ్వనాథ్ ఎంబీబీఎస్ చదివి డాక్టర్ వృత్తి కొనిసాగిస్తున్నారు.

నాగర్జున సాగర్‌లో విద్యాభ్యాసం..

మందా జగన్నాథ్‌విద్యాభ్యాసం నాగార్జున సాగర్‌లో సాగింది. తల్లిదండ్రులు మందా పుల్లయ్య, సవరమ్మలు. తండ్రి నాగార్జున సాగర్‌లో ఫైలాన్ కాలనీలో మెకానికల్ విభాగంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తుండటంతో ఆయన ఎనిమిదో తరగతి వరకు విద్యాభ్యాసం అక్కడేసాగింది. తొమ్మిది, పదో తరగతి వరంగల్ జిల్లాలోని సంగంలో సాగింది. నిజాం కళాశాలలో పీయూసీ, ఉస్మానియా కాలేజీలో ఎంబీబీఎస్ చదివారు. సూర్యాపేటలో ప్రభుత్వ డాక్టర్‌గా వృత్తిని చేపట్టి, ఏపీఎస్‌పీ 8వ బెటాలియన్, ఆ తర్వాత సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో, ఈఎస్‌టీ ఆసుపత్రిలో సర్జన్‌గా పనిచేశారు.

రాజకీయరంగ ప్రవేశం..

ఎన్‌టీఆర్ పిలుపుతో 1996లో టీడీపీలో చేరారు. నాలుగుసార్లు ఎంపీగా నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభివృద్ధికి కృషి చేశారు. తొలిసారిగా 1996లో నాగర్ కర్నూల్ ఎంపీగా పోటీచేసి ఎన్నికయ్యారు. మళ్లీ 1999లో రెండో పర్యాయం, 2004లో మూడో సారి ఎన్నికయ్యారు. ఈ దఫలోనే పార్లమెంటులో ఓటింగ్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. ఆ తర్వాత వచ్చిన 2009 పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ నుంచి పోటీచేసి నాలుగో సారి ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొని టీఆర్‌ఎస్ పార్టీకి దగ్గరయ్యారు. 2014లో టీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓటమి పాలయ్యారు. అదేసమయంలో ఆలంపూర్ నియోజవర్గం నుంచి పోటీ చేసిన తనయుడు శ్రీనాథ్ కూడా ఓటమి చెందాడు.

ఢిల్లీలో అధికార ప్రతినిధిగా..

2018లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధిగా కేబినెట్ హోదాలో నియమించింది. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చేస్తూ రాష్ట్రానికి కేంద్ర నిధులు వచ్చే విధంగా కృషి చేశారు. మళ్లీ రెండో సారి బీఆర్‌యస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడ అదే పదవిని కొనసాగించారు.

అభివృద్ధికి కృషి..

మందా జగన్నాథ్ నాలుగుసార్లు ఎంపీగా పనిచేశాడు. నేషనల్ హైవేలతో పాటు రైల్వే రంగం అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తెచ్చారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు. పెద్దపల్లి వెంకటస్వామితో కలిసి దళిత జాతి జాగృతికి కృషి చేశారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంపీ పదవికి రాజీనామా చేసి ఉద్యమానికి ఊపిరిపోశారు. ఆయన మృతి నడిగడ్డకు తీరనిలోటు.

మైసమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్త పల్లి మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవత దర్శనం కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 30వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఆదివారం హుండీ ద్వారా రూ. 1,27,557, టికెట్ల ద్వారా రూ. 63,420 మొత్తం ఒక లక్షా 90 వేల 977 ఆదాయం వచ్చినట్లు ఛైర్మన్ శ్రీనివాస యాదవ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కలశ ఊరేగింపు




కలశ ఊరేగింపులో వీరాంజనేయ స్వామి మాలధారులు

ఖిల్లాఘణపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని బెస్త గేరి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి శ్రీ రాముడు, ఆంజనేయస్వామి భారీ విగ్రహాలతో పాటు కలశ ఊరేగింపు ఆదివారం గ్రామ వీధుల్లో వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి పల్లకీ సేవలో జై శ్రీరామ్ నినాదాలు మిన్నంటాయి. వీరాంజనేయ స్వామి మాలధారణ భక్తుల అఖండ భజనలు, కీర్తనలు గ్రామంలోని కాలనీవాసులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ ఆవణలో మాజీ సర్పంచ్ క్యామ వెంకటరమణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

అక్కమహాదేవి గుహల సందర్శనకు సఫారీ సిద్ధం

- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

దోమలపెంట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రాంతం ప్రకృతి అందాలకు నిలయంగా మారింది. అమ్రాబాద్ అభయారణ్యంలో ఉన్న పర్యాటక కేంద్రాలనూ అభివృద్ధి చేసేందుకు, తెలంగాణ టూరిజం, అటవీశాఖ ఆధ్వర్యంలో ఎకో టూరిజంతో పాటు అడవుల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, దోమలపెంట రేంజ్ పరిధిలోని అక్కమహాదేవి గుహల సందర్శనకు మూడు సఫారి వాహనాలను సిద్ధం చేశారు. దోమల పెంట, వటువర్లపల్లి మార్గమధ్యలో శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి నుంచి కృష్ణానది ఒడ్డున ఉన్న అక్కమహాదేవి గుహలకు చేరేందుకు అడవి మార్గంలో సఫారీ వాహనంలో 40 నిమిషాల ప్రయాణం సాగుతుంది. నది ఒడ్డున ఉన్న అక్కమహా దేవిని దర్శించుకునేందుకు 100 అడుగుల గుట్ట కిందకు దిగాల్సి ఉంటుంది. అక్కమహాదేవి గుహలకు సఫారీని నేడు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రాంభించనున్నట్లు దోమలపెంట ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు, అటవీశాఖ ముఖ్య అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.



అక్కమహాదేవి గుహలు

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

ఉప్పునుంతల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల స్థానిక జడ్పీహెచ్ పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురువులు విశ్వనాథం, కాశన్న, దామోదర్‌రెడ్డి, ఇస్రత్‌బేగాన్ని సన్మానించారు. ఆ నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రశాంత్, నర్మద, స్వప్న, శేఖర్‌గౌడ్, ముజీబ్, విజేందర్‌రెడ్డి, లింగారెడ్డి ఉన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

ఉమ్మడి ఇండెంటే పరిష్కారం

అయిజటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : అనాది నుంచి ఆర్డీఎస్ రైతాంగం గోసను ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే ఆర్‌డీఎస్ ఆనకట్టవద్ద కుర్చీ వేసుకుని రైతులకు సాగునీరు అందిస్తామని ప్రగల్బాలు పలికిన నాయకులు కనీసం తట్టెడు మట్టిని కూడా ఎత్తిపోయలేదనేది వాస్తవం. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నది అనే చందంగా అలంపూర్ ఆర్డీఎస్ రైతుల పరిస్థితి నెలకొంది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌లో ఈ ఏడాది పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నప్పటికీ వాటిని సరైన విధంగా రైతులకు ఉపయోగపడేలా చేయలేని అధికార యంత్రాంగం వల్ల యాసంగి పంటలు ఎండే పరిస్థితులు ఏర్పడ్డాయి. నాయకులకు పూర్తిస్థాయి అవగాహన లేకపోవటమో.. అధికారుల సమన్వయ లోపమో తెలియదు కానీ ఆర్డీఎస్ రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందే విషయంపై అలంపూర్ నియోజక వర్గంలో నీలినీడలు కమ్ముకున్నాయి.

ఇండెంట్ పెట్టి అయిదు రోజులైనా..

తుంగభద్ర డ్యామ్ నుంచి అలంపూర్ నియోజవర్గ రైతులకు యాసంగి పంటకు ఈ నెల 8వ తేదీన విడుదల చేసిన ఒక టీఎంసీ నీరు ఇప్పటి వరకు ఒక్క చుక్క రాలేదు. ఆదివారం సాయంత్రం నాటికి కూడా రాజోళిబండ ఆనకట్ట వద్దకు మనవాటా నీరు చేరుకోలేదు. ఇండెంట్ పెట్టి అయిదు రోజులు గడిచినప్పటికీ సాగునీరు సకాలంలో అందకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్యామ్ నుంచి 120 కిలోమీటర్ల మేర నదిలో ప్రవహించి రాజోళిబండ ఆనకట్టకు చేరుకున్నాక అటునుంచి తెలంగాణలోని సింధనూరు వద్ద ఉన్న డీ-12 కు చేరాలంటే మరో 42 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఉన్న ఒక్కగానొక్క టీఎంసీ నీరు ఇన్ని కిలోమీటర్లు నదిలో, కాలువలో పారుకుంటూ వస్తున్న క్రమంలో కూడా గుంతలకు నిండటం, అక్రమంగా వాడే వారు తోడుయ్యటంతో మిగిలిన అరకొర నీరే తెలంగాణ రైతులకు అందాలి. అది కూడా సాధ్యమయ్యే పరిస్థితి కనిపించటం లేదు.



తెలంగాణలోని తుమ్మిళ్ల లిఫ్టువద్ద కెనాల్‌లో అడుగంటిన సాగునీరు

ఏమిటీ ఈ ఉమ్మడి ఇండెంట్ !

నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్న ప్రకారం ఈ ఏడాది యాసంగిలో తెలంగాణలోని అలంపూర్ నియోజవర్గ రైతులకు తుంగభద్ర డ్యామ్ నుంచి 5.8 టీఎంసీల సాగునీరు వాడుకునే వెసలుబాటు ఉంది. ఇదే పంటకాలానికి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు ఏడు టీఎంసీలు వాడుకునే వీలుంది. డ్యామ్‌లో ఉన్న నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకునే తెలంగాణ ప్రభుత్వం 2024 డిసెంబరు మొదటి వారంలో ఆర్డీఎస్ కింద అలంపూర్ రైతులకు యాసంగి పంటలకు గాను 37 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించింది. దీనికి అనుగుణంగానే రైతులు కూడా వివిధ రకాల పంటలు సాగుచేసుకున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయం చేసుకుని రెండు వాటాల ఇండెంట్‌ను ఒకేసారి పెట్టేవారు. దీంతో చెరో రెండు టీఎంసీల ఇండెంట్ పెడితే ఒకేసారి నాలుగు టీఎంసీల సాగునీరు నదిలో ఫ్లోగా వచ్చి ఆర్‌డీఎస్ కాలువతో పాటూ తుమ్మిళ్ల లిఫ్టు వరకు నదిలో 292.5 అడుగులకు నీరు పారే అవకాశం ఉండేది. తద్వారా తుమ్మిళ్ల లిఫ్టుతో డీ-23 నుంచి చివరి ఆయకట్టుకు ఆర్డీఎస్ ద్వారా సాగునీరు అందించే వెసలుబాటు ఉండేది. దీనివల్ల రైతుల పంటపొలాలకు కూడా ఇబ్బంది లేకుండా సాగునీరు అందేది.

ఒక్కరే ఇండెంట్ పెట్టడంతోనే సమస్య

ఈ ఏడాది యాసంగి పంటకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో గత డిసెంబరు మొదటి వారంలో గద్వాల జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు మాత్రమే ఒక టీఎంసీకి ఇండెంట్ పెట్టారు. ఈ ఒక్క టీఎంసీ నీరు ఆర్డీఎస్‌కు చేరుకునే లోపే ఆరు అడుగులకు మించి పారే అవకాశం లేదు. వాస్తవంగా ఆర్డీఎస్ వద్ద ఎనిమిది అడుగుల పైన నీరు ఉంటేనే నదిలోకి పారి తద్వారా తుమ్మిళ్ల లిఫ్టు వరకు చేరుకునే అవకాశం ఉంది. ఆనకట్ట వద్ద ఆరు అడుగుల ఉన్న నీరు తెలంగాణలోని సింధనూరు డీ-12కు వచ్చేలోపు 2.5 అడుగులకు పారుదల పడిపోతుంది. కారణం కర్ణాటకలోని రాజోళిబండ ఆనకట్ట నుంచి తెలంగాణలోని సింధనూరు వరకు ఆర్‌డీఎస్ కాలువకు పడిన గండ్లు, అనధికారికంగా మోటార్లు ఏర్పాటు చేసుకుని అక్కడి రైతులు నీటిని వాడుకోవటంతో ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విషయాలపై నీటిపారుదల శాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లోపించిందనే చెప్పాలి. దీనివల్లనే ఇప్పటి వరకు తెలంగాణ వాటాగా ఇండెంట్ ద్వారా తెచ్చుకున్న రెండు టీఎంసీల సాగునీరు 80 శాతం వృథా అవుతోందనే వాదనలు ఉన్నాయి.

సోమవారం ఆనకట్టకు చేరవచ్చు

ఆర్‌డీఎస్‌కు ఈ నెల 8వ తేదీన పెట్టిన రెండో ఇండెంట్ సాగునీరు సోమవారం నాటికి రాజోళిబండ ఆనకట్టకు చేరవచ్చు. అటు నుంచి తెలంగాణ పరిధిలోకి వచ్చేందుకు మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది. ఉమ్మడి ఇండెంట్ పెట్టిఉంటే ఎక్కువ నీరు వేగంగా పారి రైతుల పంట పొలాలకు చేరుకునేది.

- రాందాసు, ఆర్‌డీఎస్ ఏఈ‌ఈ అయిజ

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

భక్తుల ఇలవేల్పు.. భయాలను పారద్రోలే స్వామివార్ల బ్రహ్మోత్సవాలకు సమయం రానే వచ్చింది. ఈనెల 14న నాగర్‌కర్నూల్ జిల్లా సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలతో పాటు.. ఇదే జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రంగా భాసిల్లుతున్న ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కూడా ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ ఉత్సవాలకు మన రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. అందుకు గాను ఆయా ఆలయాల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.



సింగోటం గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం

నారసింహా.. శరణు.. శరణు..

- రేపటి నుంచి ప్రారంభం కానున్న సింగోటం లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- భక్తులకు లింగాకారంలో దర్శనమిస్తున్న లక్ష్మీ నరసింహుడు
- ఈనెల 17న సింగోటం జాతర షిడే మహోత్సవం

కొల్లాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆలయం ఒక పేరుతో ప్రసిద్ధి చెంది మరొక రూపంలో దేవుడు దర్శనమిస్తూ భక్తులను కట్టిపడేస్తుంది ఆ క్షేత్రం. భయాలను పారద్రోలి వరాల నొసిగే కల్పతరువుగా వాసికెక్కాడు అక్కడున్న దేవదేవుడు.. ఆ పావన ప్రదేశమే సింగోటం. లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. సంక్రాంతి పర్వదినాన జాతరకు అంకురార్పణ కానుంది.

● నాటి సింగవట్నమే... నేటి సింగోటం

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామం ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్నది. జటప్రోలు సంస్థానాన్ని పాలించిన సురభి రాజు సింగమనాయుడు అదే గ్రామంలో ఓ పొలంలో లింగాకారంలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామిని ఈ గ్రామంలో ప్రతిష్ఠించారు. సింగమనాయుడు పేరు మీద ఉన్న గ్రామం సింగవట్నంగా గుర్తింపు పొంది కాలక్రమేణా సింగోటంగా మారిపోయింది. లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం పక్కనే శ్రీవారి సముద్రం జలాశయం ఉంది. మరోవైపు పుష్కరిణి భక్తులను ఎంతో కనువిందు చేస్తుంది. ప్రతీ ఏటా సంక్రాంతి నుంచి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతాయి. ఈ బ్రహ్మోత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్ష్మీ నరసింహుని భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.

● ఉత్సవాలకు ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ సురభి రాజా ఎస్‌వీకేకేబీ ఆదిత్య లక్ష్మారావు ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆలయం ముందు భాగంలో భక్తులు క్యూ లైన్‌లో ఎండలో నిల్చోకుండా తాత్కాలికంగా తడకలతో షెడ్లు ఏర్పాటు చేశారు. భక్తులు క్యూ లైన్‌లో వెళ్లేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ విడిది గదులను అందుబాటులో ఉంచారు. సింగోటం శ్రీవారం సముద్రంలో భక్తులు పర్యాటకులు విహరించేలా తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో బోటు ఏర్పాటు చేయనున్నారు. 15 రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కానున్నారు.

● నిఘా ఏర్పాటు

సింగోటం లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు రాయలసీమ ఆంధ్ర రాష్ట్రాలతో పాటు కర్ణాటక , తమిళనాడు నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. రాయలసీమకు చెందిన భక్తులు సోమశిల కృష్ణానది మీదుగా మర బోటు ప్రయాణం చేస్తూ వచ్చి లక్ష్మీ నరసింహుని దర్శించుకుంటారు. ఎలాంటి లైవ్ జాకెట్లు లేకుండా బోటు ప్రయాణం చేయకుండా పోలీసులు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కృష్ణానది తీరాన గట్టిగా ఏర్పాటు చేయనున్నారు. స్థాయికి మించి బోటులో జనం ప్రయాణించకుండా అవగాహన కల్పించనున్నారు.

● బ్రహ్మోత్సవాల షెడ్యూల్

లక్ష్మీ నరసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 15వ తేదీ రోజు రాత్రి 8 గంటలకు కల్యాణోత్సవం , 16న రాత్రి 7 గంటలకు ప్రభోత్సవం, 17న సాయంత్రం 4 గంటలకు రథోత్సవం, షిడే మహోత్సవం, 18న రాత్రి 7 గంటలకు పుష్కర హరిణిలో తెప్పోత్సవం, 20న రాత్రి హంస వాహన సేవ కార్యక్రమాలతో లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్య నిర్వాహక కార్యదర్శి చిలుకూరి రంగారావు తెలిపారు.




అమ్మ వారి మూలవిరాట్



సింగోటం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం సమీపంలోని కోనేరు




సింగోటం ఆలయ సమీపంలో శ్రీవారి సముద్రం



ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న ఉమామహేశ్వరం కొండదిగువ ప్రాంతం



ఉత్సవమూర్తులు



ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణం

ఉమామహేశ్వరం.. దివ్య క్షేత్రం

- 15 నుంచి ఉమామహేశ్వరుడి బ్రహ్మోత్సవాలు
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలి రానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు

అచ్చంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రంగా భాసిల్లుతున్న ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15నుంచి 22 వరకు కొనసాగనున్నాయి. శ్రీశైల ఉత్తరముఖ ద్వారంగా పిలువబడే ఈ క్షేత్రం నల్లమల కొండల్లో 500 అడుగుల ఎత్తులో ప్రకృతి రమణీయత నడుమ తుమ్మెద మామిడి చెట్టుకింద ఉమామహేశ్వరుడు కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తున్నాడు. ప్రతీ ఏటా సంక్రాంతి మరుసటి రోజు ఉమామహేశ్వర క్షేత్రంలోని కొండ దిగువన ఉన్న భోగమహేశ్వరంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా జరుగుతుంది. ఈ సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గం నలుమూలల నుంచి అందంగా అలంకరించిన ప్రభలను ఉమామహేశ్వర క్షేత్రానికి తీసుకురావడం ప్రతీతి. రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలి వస్తుంటారు. ఉమామహేశ్వర ధర్మకర్త ల మండలి చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకొని భక్తుల తాకిడికి అనువుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే రూ.కోట్ల రూపాయల నిధులతో ఆలయ ప్రాంగణంలో శిథిలమై ఉన్న ఆలయాలను పునఃనిర్మిస్తున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులు కూడా హాజరవుతున్నట్లు తెలుస్తుంది.

● క్షేత్ర చరిత్ర

శ్రీశైల క్షేత్రానికి ఉత్తర ద్వారంగా నల్లమల కొండల్లో శివుడు ఉమాదేవీ సమేత ఉమామహేశ్వర స్వామిగా కొలువుదీరి ఉన్నాడు. ఈ స్థలపురాణం ప్రకారం శ్రీరాముడు రావణవధ అనంతరం శ్రీశైల ప్రదక్షిణం ఈ క్షేత్రం నుంచే ప్రారంభించినట్లు శ్రీశైల పురాణం చెబుతుంది. కాకతీయుల కాలంలో ఈ క్షేత్ర నిర్మాణం జరిగినట్లు ఇక్కడి శాసనాలు చెబుతున్నాయి. కాకతీయరాజు గణపతి దేవుడు రాజ్యపాలనలో క్రీ.శ. 1235వ సంవత్సరాన అమ్రాబాద్ ప్రాంతాన్ని చెరుకు బోలయరెడ్డి అనే అమరనాయకుడు గ్రామాన్ని పాలించినట్లు తెలుస్తుంది. పార్వతీదేవి శివుడే భర్తగా లభించాలని ఇక్కడ తపస్సు చేయగా ఈశ్వరుడు ప్రత్యక్షమై వరమిచ్చిన ప్రదేశం అందువలనే ఈ క్షేత్రానికి ఉమామహేశ్వరం అనే పేరు వచ్చింది.

● ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ఉమామహేశ్వరం క్షేత్రానికి ఆర్టీసీ ప్రత్యేకంగా 18 బస్సులను నడుపుతుంది. అచ్చంపేట నుంచి రం గాపూర్ వరకు 4 బస్సులు రంగాపూర్ నుంచి భోగమహే శ్వరం వరకు ఎనిమిది బస్సులు కొండ పైకి 12 బస్సులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రసాద్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి మరో నాలుగు బస్సులు నడుతున్నట్లు ఆయన తెలిపారు. ఎస్పీ ఆదేశాలసారం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 15మంది ఎస్సైలతో కలిపి మొత్తం 170మంది పోలీసు సిబ్బందితో ఉత్సవాల సందర్భంగా పూర్తిస్థాయిలో బందోబస్తు నిర్వహించనున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

● స్థల మహిమ

ఉమామహేశ్వర క్షేత్రంలో 11 తీర్థములు గలవు. పరమశివుడు తుమ్మెద మామిడి చెట్టుకింద కొలువుదీరి భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. ఇక్కడి 11తీర్థాలలో రుద్రధార, భస్మధార, గౌరిధార, పాపనాశనం అనే తీర్థాలు ముఖ్యమైనవి. ఇవి ఏడాది పొడవునా జలధారలు జారుతూనే ఉంటాయి. ఇక్కడికి వచ్చే భక్తులు పాపనాశిని వద్ద స్నానం ఆచరించి సకల పాపముల నుంచి విముక్తుడవుతాడు. శ్రీశైలం వెళ్లే ప్రతీ భక్తుడు ముందుగా ఉమామహేశ్వరుని దర్శించుకొని దోషం, రోగబాధల నుంచి విముక్తి పొంది అనంతరం శ్రీశైల క్షేత్రం వెళుతారన్న నానుడి ఉంది.

● బ్రహ్మోత్సవాల వివరాలు..

బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం మొదటి రోజు అయ్యప్పపూజ, జ్యోతి సమయంలో మంగళహారతి, రెండవ రోజు బుధవారం ప్రభోత్సవం తదనంతరం పల్లకిసేవ 16వ తేదీన తెల్లవారు జామున కొండ దిగువన భోగమహేశ్వరంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాల నిర్వహణ 17 శుక్రవారం రోజున ప్రాతరౌపాసన, బలిహరణం, నీరాజనం, సాయంత్రం అశ్వవాహనసేవ 18 శనివారం ఉమామహేశ్వరి దేవికి కుంకుమార్చన, రుద్రాభిషేకం, సాయంత్రం నంది వాహన సేవ 19 ఆదివారం వివిధ సేవలతో పాటు సాయంత్రం శేషవాహనసేవ, త్రిశూలస్నానం తదితర కార్యక్రమాలు ఉంటాయి.

20వ తేదీ నుంచి వివిధ కార్యక్రమాలతో పాటు పాపనాశనం నందు ఉత్తరాయణ పుణ్యకాల స్నానాలు, ప్రత్యేక పూజలు ఉంటాయి.

క్రైం కార్నర్

లైన్‌మన్ చాకచక్యం

- త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్న వైనం



ప్రమాదం నుంచి తప్పించుకొని స్తంభానికి వేలాడుతున్న లైన్‌మన్

మద్దూర్/కొత్తపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చాకచక్యంతో ఓ లైన్‌మన్ తృటిలో విద్యుత్ ప్రమాదం నుంచి తప్పించుకున్న సంఘటన నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లి గ్రామానికి చెందిన మోహీన్‌లోకుర్తి సబ్‌స్టేషన్‌లో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధులు ముగించుకొని స్వంత గ్రామమైన కొత్తపల్లికి వచ్చాడు. తన ఇంట్లో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో దీనిని సరి చేయడానికి స్థానిక సబ్‌స్టేషన్‌లో ఎల్సీని తీసుకున్నారు. అలాగే అంతకు ముందు అదే లైన్‌కు మరోచోట ఏర్పడ్డ అంతరాయాన్ని సరిచేసేందుకు ఇంకో లైన్‌మన్ కూడా ఎల్సీని తీసుకున్నారు. పని ముగించుకొని మొదటి లైన్‌మన్ ఎల్సీని వాపసు ఇవ్వగా ఆపరేటర్ అదే లైన్‌లో ఇచ్చిన మరో ఎల్సీ విషయం మరిచి గమనించకుండా విద్యుత్ సరఫరాను ఆన్ చేశాడు. ఈ క్రమంలో స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తున్న మోహీన్ విద్యుత్ షాక్ తగలడాన్ని గమనించి వెంటనే అప్రమత్తమై చాకచక్యంతో స్తంభానికి రెండు కాళ్లు బిగించి పట్టుకొని కిందికి వేలాడుతూ..త్రుటిలో పెద్ద ప్రమాదం నుంచి తపించుకున్నాడు. మోహీన్‌ను చూసి గ్రామస్థులు ఒకింత భయానికి గురయ్యారు. ఆపరేటర్ నిర్లక్ష్యంతో ఈ ఘటన చోటు చేసుకొందని స్థానికులు తెలిపారు. అతన్ని చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వంగూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన రవితేజ (22) ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత వారం రోజుల క్రితం రవితేజ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని గాయపడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రవితేజ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఎగసిపడ్డ మంటలకు ఏడాది

- గత ఏడాది ఎర్రవల్లి సమీపంలో అగ్నికి ఆహుతైన బస్సు
- మంటల్లో మహిళ సజీవ దహనం

ఎర్రవల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బోల్తా పడ్డ బస్సులో ఎగసిపడ్డ మంటలకు సరిగ్గా నేటికి ఏడాది అవుతున్నది. సంక్రాంతి పర్వదినాన ఈ ఘటన రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించింది. ఈ బస్సులో చిక్కుకున్న ఓ మహిళ సజీవదహనంతో కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలను కలవరపరిచింది. గత ఏడాది సంక్రాంతి పండుగ ముందు జనవరి 12వ తేదీ అర్ధరాత్రి హైదరాబాద్ కూకట్‌పల్లి నుంచి ప్రేవేట్ ట్రావెల్స్ బస్సు చిత్తూరుకు ప్రయాణికులతో బయలుదేరింది. బస్సులో 42మంది ప్రయాణికులతో పాటు ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై బీచుపల్లి దాటాక బీచుపల్లి, ఎర్రవల్లి మధ్యలో పదో బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు డ్రైవర్ నిద్రావస్థ కారణంగా అదుపు తప్పి బస్సు బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌లో మంటలు చేలరేగాయి. ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాక ముందే ప్రయాణికుల్లో ఎలాగోలా బయటపడ్డారు. మరికొందరు ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హర్వెస్టర్ గ్యారేజి కార్మికులు పెట్రోల్ బంక్ వర్కర్లు స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. కానీ ఏపీలోని చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం పుత్తమర్ల గ్రామానికి చెందిన మాలతి మాత్రం బస్సులోనే ఇరుక్కుపోవడం అంతలోపే బస్సులో మంటలు పెద్దగా వ్యాపించడంతో ఆమెను కాపాడటం సాధ్యపడలేదు. వీరు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నప్పటికీ సంక్రాంతి పండుగకు ఈమె సొంతూరుకు వెళుతుంది. బాధిత కుటుంబానికి మాత్రం ఇది వరకు గత ప్రభుత్వం నుంచి కానీ ప్రేవేట్ ట్రావెల్స్ నుంచి కానీ ఎలాంటి పరిహారం అందలేదనే విషయాలు తెలిశాయి. మంటల్లో మసైపోయిన బస్సు మాత్రం నేటి వరకు సంఘటన స్థలంలోనే ఉండటంతో 44వ జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు గత ఏడాది జరిగిన సంఘటనను గుర్తు చేసుకుంటున్నారు..



ఏడాది నుంచి ఘటన స్థలంలోనే ఉన్న ప్రమాదానికి గురైన బస్సు

కేసుకు చార్జిషీట్ వేశాం

గత ఏడాది జరిగిన బస్సు సంఘటన కేసును చార్జిషీట్ వేశామని తెలిపారు. ఈ కేసు కోర్టు పరిధిలో ఉందని, కేసు పురోగతి ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. కేసు ట్రయల్ అయ్యాకనే పరిష్కార చర్యలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం కూడా పండుగ సందర్భంగా రోడ్లపై అలాంటి రద్దీ ఉందని ప్రమాదాలను నివారించేందుకు సిబ్బందితో కలిసి వాహనాలను సవ్యంగా వెళ్లేందుకు కృషి చేస్తున్నామని, అతి వేగం నిద్రావస్థతో పాటు పరిమితికి మించి ప్రయాణించడంతో ఇలాంటి ఘటనలకు తావిస్తుందన్నారు. డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ జాగ్రత్తగా వెళ్లాలని సూచిస్తున్నామన్నారు.

- వెంకటేష్, ఎస్ఐ, ఇటిక్యాల

జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్న

ఉజ్జయిని పీఠాధిపతి



గురుజీ రామ్‌నాథ్ మహరాజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అలంపూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని ఉజ్జయిని పీఠాధిపతి, రాజ్యసభ సభ్యుడు, వాల్మీకిధామ్ పీఠాదీశ్వర్ ఉజ్జయిని, పీర్ రామ్‌నాథ్ మహరాజ్ జీ, భారత గుహ పీఠాదీశ్వర్ ఉమేష్ నాథ్ గురూజి సోమవారం దర్శించుకున్నారు. అంతకు ముందు వీరికి ఘనంగా స్వాగతం పలికిన వాల్మీకి నాయకులు, ప్రజలు ఆయనకు ఆలయ మర్యాదలతో విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు. తదనంతరం వాల్మీకుల యొక్క స్థితిగతులు, చిరకాల వాంఛ అయిన ఎస్టీ రిజర్వేషన్ గురించి ఆయనకు వివరంగా వివరించారు. పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వంతో మాట్లాడి ఎస్టీ రిజర్వేషన్ కోసం సహకారాలు అందించాలని రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట సమితి అధ్యక్షుడు మద్దిలేటితో పాటు నాయకులు ఉమేష్‌నాథ్ గురూజీకి వినతి పత్రం అందించారు. గురూజీ వాల్మీకి సమస్యలను వివరంగా విని నేను దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో పర్యటిస్తూ వాల్మీకుల సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గాలను చూపుతూ వస్తున్నానన్నారు. అందులో భాగంగా తెలుగు రాష్ట్రాలకు కూడా వచ్చానని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అంశం విన్నానని తెలిపారు.

మీ సమస్యకు పరిష్కారం అయ్యేందుకు త్వరలోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షాను, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసి రెండు తెలుగు రాష్ట్రాల ఎస్టీ అంశాన్ని మరోసారి చర్చించి త్వరలో పరిష్కారం అయ్యేలాగా చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి, డి.నారాయణ, బి.వెంకటరమణ, భరత్ ప్రసాద్, ఆలయ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, మాజీ చైర్మెన్ చిన్న కృష్ణయ్య, ధర్మకర్తలు జగన్ మోహన్ నాయుడు, మార్కెట్ డైరెక్టర్ కృష్ణయ్య వాల్మీకి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ జోరు

- ప్రీ క్వార్టర్స్‌కు చేరిన తెలంగాణ బాలుర జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో నిర్వహిస్తున్న 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు రసవత్తంగా కొనసాగుతున్నాయి. శనివారం మూడో రోజు జరిగిన లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ బాల బాలికల జట్లు జోరు కొనసాగింది. బాలుర విభాగంలో తెలంగాణ జట్టు డీఏవీపై 21-10 గెలిచింది. బాలికల విభాగంలో తెలంగాణ జట్టు ఐపీఎస్‌సీపై 19-01తో, అంధ్రప్రదేశ్‌పై 13-04తో వరుస విజయాలు సాధించింది. బాలుర మ్యాచ్‌లో గుజరాత్ జట్టు ఒడిశాపై 24-19, సీఐఎస్‌సీఈ జట్టు జమ్మూకాశ్మీర్‌పై 14-09, బెంగాల్ జట్టు కేరళపై 18-16, పంజాబ్ జట్టు మహారాష్ట్రపై17-15, హిమాచల్ ప్రదేశ్ జట్టు అస్సాంపై 22-17, చత్తీస్‌ఘడ్ జట్టు జార్ఖండ్‌పై 19-07, మణిపూర్ జట్టు విద్యాభారతిపై 20-18, చత్తీస్‌ఘడ్ జట్టు ఎన్‌వీఎస్‌పై 16-14, ఢిల్లీ జట్టు హర్యానపై 20-14, బీహర్ జట్టు లడఖ్‌పై 25-09తో గెలుపొందాయి. బాలికల విభాగంలో లడక్ జట్టు పుదిచ్చేరిపై 05-02, హర్యాన జట్టు సీఐఎస్‌సీఈపై 18-04, రాజస్థాన్ జట్టు జమ్మూకాశ్మీర్‌పై 20-05, కేరళ జట్టు డీఏవీపై 09-02, చత్తీస్‌ఘడ్ జట్టు తమిళనాడుపై 14-05, ఒడిశా జట్టు త్రిపురపై 15-08, కేవీఎస్ జట్టు అస్సాంపై 16-05, సీబీఎస్ఈ జట్టు వీబీపై 14-07, బీహర్ జట్టు ఎన్‌వీఎస్‌పై 14-07, జార్ఖండ్ జట్టు మణిపూర్‌పై 17-03, హెచ్‌పీ జట్టు ఎన్‌వీఎస్‌పై 11-07తో గెలుపొందాయి.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి రజనీకాంత్‌రెడ్డి

పోటీలను ప్రారంభించిన రజనీకాంత్‌రెడ్డి

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను మూడో రోజు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి రజనీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో, గెలుపు ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. ఆయా రాష్ట్ర జట్లు విజయం కోసం కృషి చేయాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. హ్యాండ్‌బాల్ జిల్లా, రాష్ట్ర క్రీడాకారులు ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి, టోర్నీ ఆర్గనైజర్ జీయావుద్దీన్, టోర్నీ నిర్వాహక సభ్యుడు బాల్‌రాజ్, పీడీలు బాల్‌రాజ్, రాఘవేందర్, నాగరాజు. ముకర్రం, బాను, అరుణజ్యోతి, స్వప్న, ఉమా, పుష్ప, తెలంగాణ జట్టు కోచ్ మేనేజర్లు ఆసీఫ్, ప్రదీప్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్



విన్నర్, రన్నర్ జట్లతో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. మహబూబ్‌నగర్ టౌన్ ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. ఆదివారం టోర్నీ ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని. క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. కొంత సమయంలో ఆటలకు కేటాయిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఫొటో గ్రాఫర్స్ పోటీలు నిర్వహించడం పట్ల సభ్యులను అభినందించారు. టోర్నీలో విజేతగా నాగర్‌కర్నూల్, రన్నర్‌గా కొత్తగూడెం జట్లు నిలిచాయి. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, హరీష్‌కుమార్, కోశాధికారి బాలచందర్, గౌరవ పట్టణ అధ్యక్షుడు నర్సప్ప, అధ్యక్షుడు అంజియాదవ్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోపాల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎల్‌వోసీ అందజేత

నర్వ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుమార్‌లింగంపల్లె గ్రామంలో ఆదివారం అదే గ్రామానికి చెందిన దాసరి కొండన్న కుమారుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రూ.ఐదు లక్షల ఎల్‌వోసీని అందించారు. అంతకుముందు ఎమ్మెల్యే లంకాల గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త కూతురి ఫంక్షన్‌లో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ తదితరులున్నారు.

కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

నారాయణపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన మరికల్ మండలం తీలేరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త ఆవుల బాల్‌రాజ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి బీమా చెక్కు అందజేశారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజేందర్‌రెడ్డి మృతుడి భార్య శారదకు రూ.రెండు లక్షల విలువ గల చెక్కును అందించారు.

కోటకొండను మండలంగా ఏర్పాటు చేయాలి

» ఈనెల 16 నుంచి జిల్లా కేంద్రంలో ధర్నా

నారాయణపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నూతన మండలాల్లో భాగంగా కోటకొండను మండలంగా ఏర్పాటు చేయాలని ఈనెల 16 నుంచి 18 వరకు జిల్లా కేంద్రంలో మూడురోజుల పాటు ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐఎంఎల్ నాయకులు బి.రాము, బాల్‌రాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చోరీలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నారాయణపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు, అనుమానిత వ్యక్తుల ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు నిర్వహించి, మాట్లాడారు. బస్టాండ్లలో రద్దీ సమయాల్లో బస్సు ఎక్కి, దిగే సమయాల్లో విలువైన బంగారం, వస్తువులు, సెల్‌ఫోన్లు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

యువత సమాజ సేవలో రాణించాలి : ఎస్ఐ

మరికల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత పరిశ్రమలు నెలకొల్పుతూ సమాజ సేవలో రాణించాలని ఎస్ఐ రాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యువక మండలి ఆధ్వర్యంలో యువజన వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, అంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణం

నారాయణపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసంలో భాగంగా ఆదివారం స్థానిక బాలాజీ మందిర్‌లో మహేశ్వరి సమాజ్ ఆధ్వర్యంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణ వేడుకలు కమనీయంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆటపాటలతో భజన సంకీర్తనలు నిర్వహించారు. భక్తిశ్రద్ధల మధ్య కల్యాణ వేడుకలు జరిగాయి.

'బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి అమానుషం'

మక్తల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో బీఆర్‌ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం అమానుషమని బీఆర్‌ఎస్ నారాయణపేట జిల్లా నాయకుడు గవినోళ్ల నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆకృత్యాలు ప్రశ్నించినందుకే బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు, కార్యాలయంపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జుట్ల సాగర్, శివారెడ్డి, సాదిక్, కురుమూర్తి, నర్సిములు పాల్గొన్నారు.

ఆర్టీఐ మండల నూతన కమిటీ ఎన్నిక

మద్దూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జి కుర్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో మండల అధ్యక్షుడిగా వెంకటప్ప, ఉపాధ్యక్షుడిగా ఎల్.మురళీ, ప్రధాన కార్యదర్శిగా డబ్బ రాము, కార్యదర్శిగా రవి నాయక్, యూత్ కన్వీనర్‌గా రమేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా నాయకుడు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం.. తల్లీ, బిడ్డ క్షేమం

మద్దూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్‌లో ఓ మహిళ ప్రసవించింది. కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామానికి చెందిన సాయమ్మ శనివారం రాత్రిపురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారమందించారు. ఈఎంటీ వెంకటేశ్, పైలెట్ సుధాకర్‌లు సాయమ్మను ఆసుపత్రికి తరలిస్తుండగా మద్దూర్ శివారులో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని వారు తెలిపారు.

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

» మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి
» ఘనంగా జయంతి కార్యక్రమాలు
» విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళులు



మక్తల్‌లోని స్వామి వివేకానంద చౌరస్తాలో వివేకానంద జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ఏబీవీపీ, వీహెచ్‌పీ నాయకులు



పేట మునిసిపల్ పార్కులో స్వామి వివేకానంద విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట టౌన్/మక్తల్/మక్తల్ రూరల్/దామరగిద్ద/కృష్ణ/ధన్వాడ/కొత్తపల్లి/కోస్గి రూరల్/మరికల్/మద్దూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్కులో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, మాజీ ఎంపీపీ బక్క నర్సప్ప, మాజీ వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, పీఆర్టీయూ ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాద్గీర్ జనార్దన్‌రెడ్డి, డీఎస్‌వో భానుప్రకాష్, నాగార్జునరెడ్డి, శ్రీనివాస్, విజయ్‌కుమార్, గోపాలకృష్ణ, నరేష్ తదితరులున్నారు.

అదేవిధంగా, మక్తల్ పట్టణంలోని స్వామి వివేకానంద చౌరస్తాలో వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వాకిటి శ్రీహరి వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భజరంగదళ్ జిల్లా నాయకుడు పస్పుల భీమేష్, వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, తపస్ మండల ప్రధాన కార్యదర్శి రాకేష్, నాయకులు పాల్గొన్నారు. అలాగే, మక్తల్ మండలంలోని జక్లేర్ గ్రామంలో లయన్స్‌క్లబ్ మక్తల్ భీమా ఆధ్వర్యంలో ఆదివారం వివేకానంద విగ్రహానికి క్లబ్ అధ్యక్షుడు డీవీ చారి బృందం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్లబ్ సెక్రటరీ కిరణ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి అంజన్‌ప్రసాద్, టి.నాగరాజు, అనుగొండ శ్రీనివాస్, రమేష్‌రావు, సూగూరు జైపాల్‌రెడ్డి, అంబదాస్‌రావు, మఠం వాదిరాజు, మామిళ్ల పృథ్వీరాజ్, సాయిజ్యోతి తదితరులున్నారు.

దామరగిద్ద మండల కేంద్రంలో వివేకానందుని విగ్రహానికి బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాల్‌రావు, మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, ఆశన్‌పల్లి గ్రామంలో భీమయ్యగౌడ్, సత్తి సత్యనారాయణ, సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, కృష్ణ మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, పిట్టల సిద్దప్ప, నారాయణభట్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ధన్వాడలో షిర్డీసాయి యువజన సంఘం, శ్రీవినాయక సాయి యువజన సంఘం ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని నిర్వహించారు. కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామ చౌరస్తాలో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

కోస్గి మండల కేంద్రంలోని వివేకానంద కూడలితో పాటు, గుండుమాల్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో యువజన సంఘం నాయకులు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మరికల్‌లో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో స్థానిక ఇందిరాగాంధీ చౌరస్తాలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్దూర్ మండల కేంద్రంలోని పెదిరిపాడ్ చౌరస్తాలో యువజన సంఘం, ఆర్యవైశ్య మండల సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వివేకానందుడి ఆశయ సాధనకు పాటుపడదాం

» ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



పేటలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో దాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఏబీవీపీ, బీజేపీ నాయకులు

నారాయణపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందుడి ఆశయ సాధనకు పాటుపడుదామని పేట మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీంలు పిలుపునిచ్చారు. ఆదివారం వివేకానంద జయంతిని పురస్కరించుకొని మునిసిపల్ పార్కులో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి, మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి యువతకు పెద్దఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చొరవతో నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గందె చంద్రకాంత్, సరాఫ్ నాగరాజ్, బోయ శరణప్ప, సతీష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, కోట్ల మధుసూదన్‌రెడ్డి, అలెనూర్ వినోద్, రమేష్, మారుతి, అఖిల్‌రెడ్డి, అనిల్, బస్సప్ప తదితరులున్నారు.

అలాగే ఏబీవీపీ ఆధ్వర్యంలో మునిసిపల్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు రతంగ్‌పాండురెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. అనంతరం వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పరిషత్ జిల్లా కన్వీనర్ నరేష్, వెంకటేష్, చరణ్‌రెడ్డి, అరుణ్, అనిల్, రఘువీర్‌యాదవ్, బజరంగ్‌దళ్ నాయకులు శ్రవణ్, అకాష్, వీరేష్, దినేష్, విజయ్, బాల్‌రాజ్, వీహెచ్‌పీ నాయకులు శివకుమార్, వెంకటేష్, రితీష్ తదితరులున్నారు. తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శేర్ కృష్ణారెడ్డి తదితరులు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

ధర్మ రక్షణ సమ సమాజ నిర్మాణమే సంఘ్ లక్ష్యం

» ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహ వ్యవస్థ ప్రముఖ్ గంట తిర్మల్‌జీ

నారాయణపేటరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సనాతన ధర్మ రక్షణ, సమసమాజ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని సంఘ్ ప్రాంతీయ సహ వ్యవస్థ ప్రముఖ్ గంట తిర్మల్‌జీ అన్నారు. ఆదివారం మండలంలోని జాజాపూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉప మండల వార్షికోత్సవ పత సంచల్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న తిర్మల్‌జీ మాట్లాడుతూ హైందవ ధర్మం అనాదిగా ఆటుపోట్లు ఎదుర్కొంటూ అతీత శక్తిగా నిలిచిందన్నారు. ఈకాలంలో కొన్ని స్వార్థశక్తుల వల్ల సనాతన ధర్మంపై విపరీత దాడులు జరుగుతున్నాయని వాపోయారు. సనాతన ధర్మం లేకుంటే మనిషి మనుగడే లేదన్నారు. దానిని పరిరక్షించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. ప్రతీ ఒక్కరూ సనాతన ధర్మం పాటించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీగిరి పీఠం సదానందస్వామి, ఖండ కార్యవహ లక్ష్మణ్ణ, శేర్‌కృష్ణారెడ్డి తదితరులున్నారు.

వీరశైవులు ప్రతీరోజు లింగపూజ చేయాలి

» నేరేడుగం పీఠాధిపతి శ్రీసిద్ధిలింగశ్వర స్వామి



లింగపూజ కరపత్రాలు విడుదల చేస్తున్న స్వామిజీ

మరికల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోని వీరశైవులందరు ప్రతీరోజు లింగపూజ చేసుకోవాలని నేరేడుగం పీఠాధిపతి శ్రీసిద్ధిలింగశ్వర స్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబిక మల్లికార్జున ఆలయంలో లింగపూజ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం వీరశైవుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతీ మండలంలో ఈనెల 20 తర్వాత మూడురోజుల పాటు పురవీధుల గుండా తిరుగుతూ లింగపూజ, విశిష్టతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. మార్చి 17న అన్ని కులస్తులకు మాగనూర్ మండలం నేరేడుగం మఠం ఆలయంలో నిరుపేదలకు ఉచితంగా సామూహిక వివాహాలను నిర్వహిస్తామన్నారు. అలాగే, 1111 మంది ముత్తయిదువులకు ఒడినింపే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మరికల్ మండలంలో లింగపూజకు హాజరయ్యే భక్తులకు ఉదయం టిఫిన్, రాత్రికి అల్పాహారం ఉంటుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి లక్కాకుల శివకుమార్, పట్టణ అధ్యక్షుడు జగదీశ్వర్, మండల గౌరవ అధ్యక్షుడు తిప్పయ్య, అధ్యక్షుడు బస్వరాజ్, వీరన్న, బసంతు, వీరేశం, శివప్రసాద్, శంకర్ ఉన్నారు.

ఆలయాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

» వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.రెండు కోట్లు
» శంభునిగుడి అభివృద్ధికి త్వరలో నిధులు

కోస్గి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగానే కోస్గి పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.రెండు కోట్ల నిధులను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. ఈ ఆలయానికి ఇప్పటికే కమిటీని సైతం ఏర్పాటు చేసింది. దీంతోపాటు పట్టణంలోని శంభునిగుడికి సైతం నూతన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఆలయానికి నిధులు కావాలని కమిటీ సభ్యులు కోరడంతో త్వరలో నిధులు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారని కమిటీ సభ్యులు తెలిపారు. కాగా ఈ ఆలయాలకు ఉన్న భూములు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్నాయని వాటిని పరిరక్షించేందుకు కృషి చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువ గల ఆలయ భూములు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉండటం.. ఆలయాల్లో దూపదీప నైవేద్యాలు నిత్యం జరగకపోవడం బాధాకరమని పలువురు పేర్కొన్నారు.

భూముల పరిరక్షణకు కృషి

- కృష్ణమూర్తి, వేణుగోపాలస్వామి గుడి చైర్మన్

వేణుగోపాలస్వామి ఆలయ భూములు కాపాడేందుకు కృషి చేస్తాం. ఇక నుంచి ఆలయంలో నిత్యం దూపదీప నైవేద్యం జరిగేలా చూస్తాం. ఆలయానికి ప్రభుత్వం పూజారిని కూడా నియమించింది. ఇలాంటి పురాతన ఆలయం ఎక్కడ కూడా లేదు. ఆలయానికి పునర్ వైభవం తెస్తాం.

నేటి నుంచి క్షీరలింగేశ్వర స్వామి జాతర



ముస్తాబైన కమరి మఠం
(అంతర చిత్రంలో) శ్రీసద్గురు క్షీరలింగేశ్వర మహాస్వాముల మూల విగ్రహం

కృష్ణ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణ మండలంలో పవిత్రమైన కృష్ణానది తీరాన వెలసిన సద్గురు క్షీరలింగేశ్వరస్వామి 75వ వజ్రోత్సవ జాతర ఉత్సవాలు ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నామని కమరి మఠం అభివృద్ధి సభ్యుడు ఈరప్పగౌడ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. సోమవారం విగ్రహ మూర్తి అలంకరణ, పూజలు, 14న సాయంత్రం వీరశైవుల ఆధ్వర్యంలో నందికోల సేవ, 18న సాయంత్రం సందెపు రాళ్లు ఎత్తే పోటీలు, భజనలు, 19న తెల్లవారుజామున ఉత్సవ విగ్రహానికి రుద్రాభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశానికి హాజరైన నాయకులతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

» మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పార్టీ శ్రేణులు సత్తా చాటాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు, మునిసిపాలిటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీలు ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బోయ రవికుమార్, నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన పట్టణంలోని బురాన్‌గడ్డలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తదితర సమస్యలను పరిశీలించారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

శిశుమందిరాలు సంస్కృతీ సాంప్రదాయాలకు నిలయాలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సాంప్రదాయాలకు శిశుమందిరాలు నిలయాలు అని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎంఈవో అనిల్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో జరుగుతున్న శిశుమందిరాల ఉమ్మడి జిల్లా ఆటల పోటీలకు వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఆట పాటల ద్వారానే శారీరక, మానసిక ఉల్లాసం అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. క్రీడల నిర్వహణకు సహకరించిన పీఈటీలు గోపాలం, రమేష్‌కుమార్, దామోదర్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిల, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, సీఐ చంద్రశేఖర్, శిశుమందిర్ పాఠశాల అధ్యక్షుడు రఘుప్రసన్నభట్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : డీఎస్పీ లింగయ్య



అభంగాపూర్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్

నారాయణపేటరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు, మానసికోల్లాసాన్ని పొందవచ్చని పేట డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్‌లు అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అభంగాపూర్ గ్రామంలో గ్రామ యువకులు ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను వారు ప్రారంభించి, మాట్లాడారు. వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానందుడిని యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్సిములు, మాజీ సర్పంచ్ విక్రంగారి వర్ష, భగవంతు, లక్ష్మీకాంత్, రాములు, రమేశ్, చెన్నప్పలు పాల్గొన్నారు. అదేవిధంగా, మండలంలోని జాజాపూర్ గ్రామంలో జరుగుతున్న జీపీఎల్ క్రికెట్ పోటీలను యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మన్నెసురేష్, అలుగడ్డ రవికుమార్, వెంకటేశ్, లక్ష్మణ్, హరీష్‌గౌడ్, శివకుమార్‌గౌడ్ తదితరులున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు



గెలుపొందిన క్రీడాకారులతో నాయకులు

దామరగిద్ద, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో భవానీమాత మందిరం ఆవరణలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొత్తం 16 టీములు పాల్గొనగా ప్రథమ బహుమతి మద్దూరు మండలం జాజరావుపల్లి దక్కించుకోగా రెండవ బహుమతి దామరగిద్ద మండలం కానుకుర్తి దక్కించుకుంది. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాల్‌రావు, మండల అధ్యక్షుడు సంజీవగౌడ్, తమ్మలి వెంకట్రాములు, సత్యనారాయణరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటప్ప, ఎంపీటీసీ మాజీ సభ్యులు అశోక్, శరణప్ప, శరణ్‌నాయక్, విజయమోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



14వ వార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలతో నిర్వాహకులు

నారాయణపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని 14 వార్డు మార్కండేయ స్వామి దేవాలయంలో సంక్రాంతిని పురస్కరించుకొని ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. రైతు సంఘం నాయకుడు బండి రాంరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు యువజన కాంగ్రెస్ నాయకుడు బండి ఆనంద్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవానికి బండి హర్షిత, మనుమహరి చైతన్య, బండి అఖిల, రాఘవేంద్రలు హాజరై, బహుమతులు అందిచారు. అలాగే ఎస్ఎస్‌కే సమాజ్ మడి ఆధ్వర్యంలో ఈశ్వర్ మందిర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మహిళామోర్చా అధ్యక్షురాలు తులసీబాయి, బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ నందునామాజీ, అంబదాస్, రమేష్, అముల్, బాల్‌రాజ్, తుల్జారామ్ తదితరులున్నారు.

చిరుత సంచారం

కొత్తపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్పటిఘట్టు శివారులో ఉన్న గుట్ట ప్రాంతంలో ఆదివారం సాయంత్రం చిరుత సంచరించింది. చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న రైతులు చిరుతను చూసి భయాందోళనకు గురయ్యారు. వెంటనే రైతులు పంట పొలాల్లో కట్టేసిన పశువులను ఇళ్లకు తరలించుకు వెళ్లారు. ఫారెస్టు అధికారులు చిరుతను బంధించి, ఇక్కడినుంచి తరలించాలని రైతులతో పాటు, గ్రామస్థులు కోరారు.